క్లుప్తంగా

బోరు మోటారు, కేబుల్ వైర్ చోరీ



పొలం వద్ద సింథటిక్స్ ట్యాంకును, పైపులను కాల్చి వేసిన దుండగులు

పాకాల: గుర్తు తెలియని దుండగులు బోరు మోటరు, కేబుల్ వైర్‌ను చోరీ చేసిన సంఘటన మండలంలోని సామిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. శనివారం బాధితుడు ద్వారకాబాబు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి సమీపంలోని తన పంట పొలంలో దుండగులు చొరబడి స్టార్టర్ బాక్స్‌ను పగల గొట్టి, ఫీజు క్యారియర్‌ను ధ్వంసం చేసి 20 మీటర్ల కేబుల్‌ను కత్తిరించుకుని వెళ్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పొలం వద్ద గల సింథటిక్స్ వాటర్ ట్యాంకు, పైపులకు నిప్పు పెట్టి నష్టం కలిగించారని వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బంగారు తిరుచ్చిపై శ్రీనివాసుడి చిద్విలాసం



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఆలయ ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయం



నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధికారులు

తిరుపతి సిటీ: నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయమని, ఎస్వీ యూనివర్సిటీ స్థాపనలో ఆయన కృషి ఎనలేనదని వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నీలం సంజీవరెడ్డి 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్వీయూలోని ఆయన విగ్రహానికి వీసీ పూలమాల వేసి అధికారులతో కలసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 1954లో వర్సిటీ స్థాపించబడిందని ఇందులో నీలం సంజీవరెడ్డి కృషి ఎంతో ఉందని, ఆయనకు వర్సిటీ ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఆయన దీర్ఘదృష్టి కారణంగా వేల మంది విద్యార్థులు వర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ఇంజినీర్ తాండవ కృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజనులపై పచ్చమూక దాడి దుర్మార్గం

తిరుపతి కల్చరల్: పెత్తందారి అహంకారంతో పచ్చమూక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలను చూసి ఓర్వలేక విచక్షణా రహితంగా అవహేళన చేయడం దుర్మార్గమని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. శనివారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషియల్ మీడియా వేదికగా బడుగు, బలహీనవర్గాలను కించపరుస్తూ ఓ టీడీపీ కార్యకర్త సిగ్గుమాలిన మాటలతో తమ మనోభావాలను దెబ్బతీశారన్నారు. బడుగు, బలహీనవర్గాలపై దాడులు చేసి అణచివేతకు గురి చేసిన చరిత్ర టీడీపీ అధినేత చంద్రబాబుదేనన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నాడు నేడు బడులను పార్టీ కార్యాలయాలుగా మార్చి కుల వృత్తులకే పరిమితం చేస్తామటూ సోషియల్ మీడియా వేదికగా వ్యాఖ్యలు చేసిన టీడీపీ అగ్రకుల అహంకారుడిపై సంబంధిత అధికారులు అట్రాసిటీ కేసుపెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

రామభక్త హనుమాన్‌కు జై...



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీకోదండరామస్వామి



తొండవాడ పంచముఖ అంజనేయ స్వామికి క్షీరాభిషేకం



శ్రీవారిమెట్టు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అంజనీ పుత్రుడు



చంద్రగిరి శ్రీకోదండరామాలయంలో శ్రీఅభయాంజనేయ స్వామివారు



చిన్నగొట్టిగల్లులో హనుమజ్జయంతి అలంకరణ



ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

- వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు

చంద్రగిరి: రఘుకుల వంశోద్ధారకుడైన శ్రీరామచంద్రుడి అత్యంత ప్రియ భక్తుడు శ్రీవీరాంజనేయ స్వామివారి జయంతి వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. జై హనుమాన్, జై శ్రీరామ్ అంటూ భక్తుల నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. కోట గ్రామంలో శతబ్దాల కాలం నాటి అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారికి ఫల పుష్ప సుగంధ ద్రవ్యాలతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు. తదుపరి సింధూర సహస్రనామార్చన, మహానైవేద్యం, శ్రీరామ హోమ కార్యక్రమాలను నిర్వహించారు. తిరిగి సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు.

తొండవాడలో...

తొండవాడ పంచాయతీలో వెలసిన 30 అడుగుల శ్రీపంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి మహాహోమం కార్యక్రమం నిర్వహించి, 1008 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అభిషేక సేవను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు.

తిరుచానూరులో...

తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో వెలసిన శ్రీఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి అభిషేక సేవలను నిర్వహించారు. అనంతరం వడ మాల, తమలపాకుల మాలతో శోభాయమానంగా అలంకరించారు.



శ్రీసీతారామలక్ష్మణులకు హారతి సమర్పిస్తున్న అర్చకులు



లక్ష కదళీఫల అలంకరణలో శ్రీమలయాళహనుమంతుడు



వానర వనంలో శ్రీఆంజనేయ స్వామి



స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

శ్రీవారి మెట్టు వద్ద...

శ్రీవారి మెట్టు వద్ద క్రీస్తు పూర్వం 16వ శతాబ్దంలో వెలసిన అతి పురాతనమైన శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తుల భజన కార్యక్రమాలను నిర్వహించారు.

నాలుగుకాళ్ల మండపం వద్ద...

తిరుపతి కల్చరల్: నాలుగు కాళ్ల మండపం వద్దనున్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం కావడంతో వేకువజామున రంగస్థలి కళాకారుల ఆధ్వర్యంలో 60 మంది కళాకారులు శ్రీగోవిందరాజస్వామి ఆలయం నాలుగు మాడ వీధుల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నామ సంకీర్తనలతో భజనలు చేస్తూ ప్రదక్షిణ చేశారు.

వైభవం.. హనుమజ్జయంతి వేడుకలు

పాకాల: దామలచెరువు శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేకమైన పూజా కార్యక్రమాలను నిర్వహించి, సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దాస భక్తుడైన ఆంజనేయస్వామి సీతారామ లక్ష్మణులకు ఆహారంగా మామిడి ఫలాలను అందించిన పవిత్ర స్థలం దామలచెరువు సీతారామాంజనేయ స్వామి ఆలయమని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ఆంజనేయ స్వామివారిని తమలపాకులు, వడ మాలలు వేసి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వీఎస్ కృష్ణమూర్తిస్వామి, శ్రద్ధట్రస్ట్ చైర్మన్ రెడ్డెప్పరెడ్డి, సురేంద్ర, రఘు, గణపతిరెడ్డి, చక్రపాణి, భక్తులు పాల్గొన్నారు.

భాకరాపేటలో...

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో హనుమజ్జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని చిన్నగొట్టిగల్లు శ్రీఆంజనేయ స్వామి ఆలయం, చట్టేవారిపాళెం వద్ద ఉన్న హనుమాన్ ఆలయం, భాకరాపేట పంచాయతీలోని చిన్నగాండ్లపల్లెలోని శ్రీభక్తి సిద్ధి అభయ ఆంజనేయ స్వామి సేవా సమాజ్ ఆలయంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంటా హనుమజ్జయంతిని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పండుగ చేసుకున్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలో వెలసిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో, నెత్తకుప్పంలోని వానర వనంలోని శ్రీఆంజనేయస్వామికి, కుప్పంబాదూరు వెలసిన శ్రీప్రసన్నాంజనేయ స్వామికి, రాయలచెరువుపేట సమీపంలోని శ్రీ శనైశ్వర ఆలయంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ క్రమంలోనే శ్రీశక్తిపీఠం ఆవరణలో వెలసిన శ్రీమలయాళ హనుమంతునికి శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకుడు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతీ లక్ష కదళీ ఫలాలు, నాగవల్లీ దళార్చన చేశారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి కోదండరామాలయంలో...

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయానికి ఎదురుగానున్న శ్రీఆంజనేయ స్వామివారి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు శ్రీసీతారామలక్ష్మణ స్వామి ఉత్సవమూర్తులను శ్రీఆంజనేయ స్వామివారి ఆలయానికి వేంచేపు చేశారు. శ్రీఆంజనేయ స్వామివారి మూలవర్లకు, శ్రీసీతారామ, లక్ష్మణస్వామి వార్ల ఉత్సవర్లకు వైభవంగా అభిషేకం చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్రమూర్తి హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దాస్యభక్తికి ప్రతీకగా శ్రీరాముల వారు హనుమంత వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌కుమార్ దీక్షితులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పాల దినోత్సవం





ర్యాలీ నిర్వహిస్తున్న డెయిరీ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు, అధికారులు, ప్రజలకు మజ్జిగ పంపిణీ

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాల, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పాల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నగర ప్రజలకు పాల ఉత్పత్తుల ప్రయోజనాలను వివరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. డెయిరీ టెక్నాలజీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీరోడ్ వద్దనున్న కృష్ణాపురం ఠాణా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కళాశాల అధికారులు, ఏపీ చాప్టర్ ప్రతినిధులు మాట్లాడుతూ పాలతో తయారు చేసిన ఉత్పత్తులతో సమతుల పౌష్టికాహారం లభిస్తుందన్నారు. పాల ఉత్పత్తులు, సేకరణ రంగంలో మహిళలు పెద్ద ఎత్తున ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పాల ఉత్పత్తుల వినియోగంతో మానవుని ఆరోగ్యంతోపాటు దేశ, రాష్ట్ర ఆర్థిక ప్రగతి మెరుగు పడుతుందన్నారు. అనంతరం ఎస్వీ యూనివర్సిటీ ముఖద్వారం వద్ద నగర ప్రజలకు పెద్ద ఎత్తున మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.నాగేశ్వరరావు, డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వై.రవీంద్రారెడ్డి, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ విజయ గీత, రవివర్మ, రాము, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు తావులేదు



ప్రత్యేక దళాలకు దిశానిర్దేశం చేస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ రవికుమార్

చంద్రగిరి: సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ విడుదలైన నేపథ్యంలో మండలంలో ఎటువంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా బందోబస్తును ముమ్మరం చేసినట్లు చంద్రగిరి ఇన్‌చార్జ్ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ప్రత్యేక దళాలకు దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలు దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దళాల ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందన్నారు. ప్రజలందరూ కూడా శాంతిభద్రతలకు విఘాతం కలించకుండా, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక దళాలతో కవాతు నిర్వహించి, ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం కలిగించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామయ్య, ఎస్ఐ అనిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్ రాజుకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి ఎం.కిరణ్‌కుమార్ రాజుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.దేవరాజులు పర్యవేక్షణలో సోషియో ఎకనమిక్ కండిషన్స్ ఆఫ్ స్ట్రీట్ గార్మెంట్ వెండర్స్–ఎ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఏపీ అనే అంశంపై పరిశోధన పత్రాలను సమర్పించారు.

హథీరాం బావాజీ ఆలయంలో భోగ్‌భండార్



హథీరాం బావాజీకి భోగ్‌భండార్ నిర్వహిస్తున్న బంజారా పెద్దలు

తిరుపతి రూరల్: మండలంలోని వేదాంతపురంలో నూతనంగా నిర్మించిన శ్రీహథీరాం బావాజీ ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం రాత్రి భోగ్‌భండార్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి బంజారా సాంప్రదాయ పద్ధతిలో భోగ్ భండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హథీరాం బావాజీ ఆలయ కమిటీ కన్వీనర్ శివనాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



కేంద్ర బలగాలతో గస్తీలో పాల్గొన్న సీఐ రాజగోపాల్

పాకాల: ఏపీ సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్, ఎన్నికల లెక్కింపుల్లో భాగంగా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ రాజగోపాల్ తెలిపారు. శనివారం మండలంలోని పంటపల్లి, పులివర్తివారిపల్లి, పాకాలలో డీఎస్పీ రవికుమార్, ఏఎస్పీ రాజేంద్ర సమక్షంలో పర్యటించి హెచ్చరికలు, జాగ్రత్తలు తెలిపారు. పార్టీలకు సంబంధించి అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు అన్ని చర్యలు ఎలక్షన్ కమిషన్ తీసుకుందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర బలగాలతో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశామని, రాత్రి సమయాల్లో గస్తీ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.





ఉరుములు.. మెరుపులు

తిరుపతిలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో నగరం కొంత చల్లబడింది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

వినోదభరితం... భువనేశ్వరి ఎగ్జిబిషన్



అతి పెద్ద చేప ముఖద్వారం

తిరుపతి కల్చరల్: మండు వేసవిలో ప్రజలకు సంధ్యా వేళ ఉత్సాహం, ఉల్లాసంతో కూడిన వినోదాన్ని అందిస్తూ ఆనందభరితుల్ని చేస్తున్న ప్రదర్శన భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్. గత 25 ఏళ్లుగా ఆధ్యాత్మిక నగరంలో ప్రపంచంలోని ఏడు వింతలతోపాటు అత్యంత ప్రాముఖ్యత కలిగిన దైవ క్షేత్రాలు, ఫారిన్ సిటీస్ తదితర అధునాతన రీతిలో నడుపుతున్నారు. వింత ప్రపంచంలో విహరించేలా అద్భుత ముఖద్వార సెట్టింగ్స్‌తో ఎగ్జిబిషన్ నడుపుతూ నిర్వాహకుడు బి.శ్రీనివాస్ జిల్లా ప్రజలను ఉత్తేజంతో ఆనందభరితుల్ని చేస్తున్నారు. ఈ ఏటా అందరిని సరికొత్త అనుభూతిని కలిగించేలా 200 అడుగుల చేప ముఖద్వారంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అవెంజర్స్ షో, దెయ్యాల కోటతో పాటు 30 వరకు జాయింట్ వీల్స్, డ్యాన్స్ కారులు, కొలంబస్ తోపాటు పిల్లలకు ఉత్తేజ పరిచే అద్భుత అమ్యూజ్‌మెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆకట్టుకుంటున్నాయి. ఇవేకాక సరికొత్త దుస్తులు, గృహోపకరణ వస్తువులు షాపులు, పిల్లలను ఉల్లాస పరిచే గేమ్స్ ప్రజల్ని ఆకట్టుకుంటున్నాయి.

ఏపీలో ప్రజల నాడి సస్పెన్స్‌గా ఉంది



శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్

తిరుమల: ఏపీలో ప్రజలు నాడిపై సస్పెన్స్ కొనసాగుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో రెండోసారి వైఎస్ఆర్ సీపీకి అధికారం ఇస్తారా.. ప్రభుత్వ మార్పు కోరుకుంటున్నారా అనేది ఉత్కంఠభరితంగా ఉందన్నారు. ఏ సర్వేలో కూడా ప్రజల నాడి బయటికి రాలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాత్రమే గట్టి పోటీ నడుస్తోందని తెలిపారు. మెజారిటీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.